కథ

# మంచితనానికి జై

సి. ఎన్. చంద్రశేఖర్



''హాయ్ సునీ.. నేనొచ్చేశా'' అంటూ ఆనందంగా ఇంట్లోకి అడుగుపెట్టిన జయంత్ సునీత ముభావంగా ఉండటం చూసి ఆశ్చర్యపోయాడు.

''సునీ.. ఏమైంది!'' అని అడిగాడు.

''ఏమీ కాలేదు. శనివారం గడచిపోయింది. అంతే'' నిర్లిప్తంగా అంది.

''ఏం చేయను సునీ...''

''ప్లీజ్. ఇంకేం చెప్పకండి. రాత్రంతా మీ కోసం ఎదురు చూసి చూసీ నా మనసు అలసిపోయింది.

''సారీ సునీ. మా బాసు నన్ను రాత్రి పది గంటల వరకూ సతాయించాడు. భోజనం చేసి బస్‌స్టేషన్ చేరేసరికి పదకొండయ్యింది. శనివారం కాబట్టి అన్నిబస్సులూ ఫుల్. ఓ బస్సులో కాస్త స్థలం దొరికితే విజయవాడ నుండి హైదరాబాద్ వరకూ నిలబడి వచ్చాను. ఒక్కరోజు కోసం యిన్ని అవస్థలు పడింది ఎవరికోసమనుకున్నావు? నీ కోసం... నీ ఆనందం కోసం''

''సారీ... సారీ'' తన ప్రవర్తనకు నొచ్చుకుంటూ అంది సునీత.

''ఫర్వాలేదు. నా మీద కోపం పోయినట్లేనా?'' అమాయకంగా ముఖం పెట్టి అడిగాడు.

''నా కోపం ఎంతసేపండీ మీరు అమాయకంగా ఇలా ముఖం పెట్టగానే నా కోపం గప్పున చల్లారిపోతుంది. పదండి... స్నానం చేసి వస్తే టిఫిన్ ఇస్తాను. మీకిష్టమైన ఇడ్లీ, కొబ్బరిపచ్చడి కాంబినేషన్ సిద్ధంగా ఉంది.

* * *

''సునీ.. టవల్'' బాత్ రూమ్ తలుపు తెరిచి అరిచాడు జయంత్.

''లోపలే ఉంది'' పూజగది నుంచి జవాబిచ్చింది సునీత.

నిమిషం తర్వాత ''సోపు'' అని అరిచాడు బాత్ రూమ్‌లోంచి తల బయటకుపెట్టి ఆమె అతని దగ్గరకు వచ్చి ''అన్నీ లోపలే ఉన్నాయి. ముందు సోపు, తర్వాత టవలు అడగాలని తెలియదు అమాయక చక్రవర్తికి'' అంటూ నెత్తి మీద మొట్టింది.

* * *

''సునీ... విజయవాడ నుంచి నీ కోసం ఏం తెచ్చానో చెప్పుకో చూద్దాం''

''శారీ?''

''యు ఆర్ రైట్'' అంటూ బ్యాగులో నుంచి అట్టపెట్టె తీసి ఆమె చేతికిచ్చాడు. పెట్టె మూత తీసి చూసిన ఆమె కళ్ళు ఆశ్చర్యంతో వెడల్పయ్యాయి.

''మై గాడ్... పట్టుచీరా?''

అవునన్నట్టు ఆమె వైపు గర్వంగా చూశాడు.

''ఎంతైంది?''

''మూడు వేలు''

''ఎందుకండీ అంత డబ్బు ఖర్చుపెట్టారు. మామూలు నైలాన్ చీర కొని తెచ్చున్నా నేను సంతోషించేదాన్ని''

''ఆ విషయం నాకు తెలుసు సునీ. జీవితంలో చిన్న చిన్న కోరికలు కూడా తీర్చుకోలేకపోతే బ్రతకడం ఎందుకు? నీకు పట్టుచీర కొనాలని మన పెళ్ళికి ముందు నుంచీ ప్రయత్నిస్తున్నాను. ఏవో అడ్డంకులు వచ్చేవి. అందుకే ఈసారి బోనస్ డబ్బులు చేతిలో పడగానే మరో ఆలోచన లేకుండా కొనేశాను... ఎలా ఉంది నా సెలెక్షన్?''

''అద్భుతం. అయితే నా సెలక్షనంత అద్భుతం కాదులెండి'' అంది సునీత.

అలిగినట్లు బుంగమూతి పెట్టాడు జయంత్.

''నిజమండీ. మీరు నా సెలక్షన్ కదా. మరి నా సెలక్షన్‌ను చీట్ చేయండి చూద్దాం.''

జయంత్ ఆనందంగా నవ్వాడు.

* * *

జయంత్ కూరగాయలు తరిగిస్తే సునీత వంట పూర్తి చేసింది. వంటలో కూడా అతను ఆమెకు చాలా వరకు సహాయం చేశాడు.

భోజనాలయ్యాక ఇద్దరూ టీవీ ముందు కూర్చున్నారు. సునీత టీవీ ఆన్ చేసి ''అరె. మంచుపల్లకి సినిమా వస్తోంది'' అంది.

జయంత్ రిమోట్ అందుకుని టి.వి. ఆఫ్ చేశాడు.

''జై. చిరంజీవి పరిశ్రమకు వచ్చిన క్రొత్తలో తీసిన సినిమా అది. నాకు చాలా యిష్టం ఆ సినిమా. ప్లీజ్ పెట్టవూ.''

''నాకు ట్రాజెడీ సినిమాలు యిష్టం ఉండవు.''

ఆమె అతనివైపు చూసింది. అతని కళ్ళ నిండా నీళ్ళు.

''జై. ఏమిటిది?'' అతని గడ్డం పట్టుకుని అడిగింది. అతను ముఖం ప్రక్కకు తిప్పుకున్నాడు.

''మీ మనసు చాలా సున్నితం'' అంది సునీత.

''కాదు. సునీతం'' అన్నాడు జయంత్ నవ్వేస్తూ....

* * *

''సునీ. మనం గుడికెళ్దామా?''

''తప్పకుండా''

''ఏ గుడికెళ్దాం?''

''ఏ గుడి అయినా ఫర్వాలేదు. కానీ అక్కడ నేను, మీరు, దేవుడు మనం ముగ్గురమే ఉండాలి.''

''పూజారితో కలిసి నలుగురం ఉంటాం. ఫర్వాలేదా?''

''ఫర్వాలేదు'' అంటూ నవ్వింది.

జయంత్ ఎవరికో ఫోన్ చేసి కారు పంపించమని చెప్పడం విన్నది సునీత.

''కారెందుకండీ? బస్సులో వెళ్ళలేమా?'' అని తర్వాత అడిగింది.

''చిలుకూరు దగ్గర ఓ సాయిబాబా గుడి ఉంది. అక్కడ రష్ ఉండదు కాబట్టి ప్రశాంతంగా ఉంటుంది. ఇక్కడ్నుంచి ఆ గుడి చాలా దూరం కాబట్టి బస్సులో వెళ్ళలేం. అందుకే నా స్నేహితుడికి ఫోన్ చేసి కారు పంపించమన్నాను''

అరగంట తర్వాత కారు వచ్చింది. కారు తెచ్చిన స్నేహితుణ్ణి సునీతకు పరిచయం చేశాడు జయంత్.

''తను ప్రసాద్. నా స్నేహితుడు. సినిమాల్లో నటిస్తుంటాడు.''

''ఆయన నాకు తెలియకపోవడమేమిటి? చాలా సినిమాల్లో చూశాను. నమస్తే అండీ. మీ నటన నాకు చాలా యిష్టమండీ'' అంది సునీత ఎగ్జయిట్‌మెంట్ ఫీలవుతూ...

''నమస్తే. థ్యాంక్యూ'' అన్నాడు ప్రసాద్ చేతులు జోడించి.

'అబ్బ. సినిమా హీరోయిన్లను తలదన్నేలా ఎంత అందంగా ఉంది ఈమె!' అనుకున్నాడు మనసులో.

స్నేహితులిద్దరూ మాట్లాడుకుంటుంటే సునీత కాఫీ చేసి ఇచ్చింది.

* * *

బాబాను దర్శించుకున్నాక గుడి ప్రాంగణంలో ఉన్న తోటలో ఓ బెంచీపై కూర్చున్నారు జయంత్, సునీత.

సమయం ఏడుదాటింది అప్పటికి. భక్తులందరూ వెళ్ళిపోయారు. పూజారి గర్భగుడిలో ఉన్నారు.

''జై. మీ ఒడిలో తలపెట్టుకోనా?'' సునీత అడిగింది. జయంత్ తలూపాడు.

''జై. మీరు నాకెలా కనిపిస్తున్నారో తెలుసా!''

''ఎలా?''

''మా అమ్మలా, మా నాన్నలా''

''అంత ముసలితనం కనిపిస్తోందా నాలో?''

''లేదు. అంత ఆత్మీయంగా అనిపిస్తున్నారు. నా మీద యింత ప్రేమ చూపుతూ, అడిగిన కోరికలన్నీ తీరుస్తూ, అన్ని విధాలా నాకు సహాయం చేస్తూ నన్ను ఓ పసిపాపలా చూసుకుంటున్న మీలో మా అమ్మానాన్నలిద్దరూ కనబడుతున్నారు. జై.. ఇలాగే మీ ఒడిలో తలపెట్టుకుని కన్నుమూయాలని ఉంది.''

''ముందు నేను నీ నోరు మూస్తాను'' అరచేత్తో ఆమె నోరు మూస్తూ అన్నాడు జయంత్.

* * *

**నిమిషం తర్వాత ''సోపు'' అని అరిచాడు బాత్ రూమ్‌లోంచి తల బయటకుపెట్టి ఆమె అతని దగ్గరకు వచ్చి ''అన్నీ లోపలే ఉన్నాయి. ముందు సోపు, తర్వాత టవలు అడగాలని తెలియదు అమాయక చక్రవర్తికి'' అంటూ నెత్తి మీద మొట్టింది.**

ఇంటికొచ్చాక ఇద్దరూ చాలాసేపు మౌనంగా కూర్చుండిపోయారు.

''భోజనం వడ్డించనా?'' సునీత అడిగింది.

''ఇద్దరం కలిసే తిందాం''

అతను అన్నం కలుపుకున్నాక ''ఆ అన్నం నా కంచంలో వెయ్యండి. మీరు మళ్ళీ కలుపుకోండి. మీరు కలిపిన అన్నం చాలా బాగుంటుంది'' అంది సునీత.

''అయితే ముందు నువ్వు కానివ్వు. నేను తర్వాత తింటాను''

అతను కలిపి ముద్దలు చేసి చేతిలో పెడుతుంటే సునీత తినసాగింది.

భోజనాలయ్యాక బ్యాగు సర్దుకుని బయలుదేరుతున్న జయంత్ వైపు బేలగా చూసింది.

''జై. మీరు వెళ్ళక తప్పదా?''

''తప్పదు సునీ. అక్కడ నా మొదటి భార్య కాచుకుని ఉంటుంది.''

''అవునులెండి. నాతో పెళ్ళికి ముందునుంచీ మీతో ఉన్నదిగా అది. పోనీ ఓ రెండు రోజులు సెలవు పెట్టి ఉండిపోరాదూ?''

''కుదరదు సునీ. వచ్చే ఆదివారం మళ్ళీ వస్తాగా''

''తప్పకుండా వస్తారా?''

''తప్పకుండా వస్తాను''

''ప్రామిస్'' చేయి చాపుతూ అంది. జయంత్ ఆమె చేతిలో చేయి ఉంచి ''ప్రామిస్'' అన్నాడు. తర్వాత ఆమె చేతిని పట్టుకుని మృదువుగా నొక్కి వదిలాడు.

ఆ స్పర్శ ఆమెలో దాగిన బాధను ఏడుపు రూపంలో బయటకు తెచ్చింది. ఆమె ఒక్క ఉదుటున వచ్చి అతని కౌగిలిలో వాలిపోయి ఏడవసాగింది.

''సునీ.. ప్లీజ్.. ఏడవకు. ఇంకో వారం రోజులు ఆగాలి. అంతేగా''

సునీత కళ్ళు తుడుచుకుని ''అవును. వారం రోజులేగా. ఓకే బై. హ్యాపీ జర్నీ'' అంది.

''థ్యాంకూ. బై''

జయంత్ రోడ్డు మీదికొచ్చాక ఓ కారు వచ్చి అతని దగ్గర ఆగింది. అతను ఫ్రంట్ డోర్ తెరచి కార్లో కూర్చున్నాడు.

''ఇంటికేనా!'' డ్రైవింగ్ సీట్లో ఉన్న శైలజ అడిగింది.

అవునన్నట్టు తలూపాడు. అతని ముఖంలో కలత గమనించిన ఆమె అతని చెయ్యి పట్టుకుని మృదువుగా నొక్కింది.

□□□□□

బెడ్ రూమ్‌లోని ఫోను రింగవడం విని శైలజ రిసీవర్ తీసి మాట్లాడింది. అప్పుడే నిద్ర లేచిన జయంత్ ''ఆదివారం యింత ప్రొద్దునే ఎవరు ఫోన్ చేశారు?'' అని అడిగాడు ఆమెని.

''మైకేల్ గారు''

జయంత్ ఆందోళనగా ఆమె వైపు చూశాడు.

''మనం హాస్పిటల్‌కు వెళ్ళాలి. రెడీ అవండి.''

జయంత్ లేవలేదు. ఆమె ఇంకా ఏం చెబుతుందో అని ఆమె వైపే చూస్తున్నాడు.

''దార్లో ఓ పూలమాల కొని తీసుకెళదాం'' బాత్‌రూమ్ వైపు నడుస్తూ అంది శైలజ.

జయంత్ బాధగా కళ్ళు మూసుకున్నాడు. అతని కళ్ళ ముందు సునీత వ్రాసిన ఉత్తరం మెదిలింది. అప్పటికీ చాలా సార్లు చదివాడు కనుక ఆ ఉత్తరంలోని ప్రతిపదం అతనికి గుర్తే.


హీరోగారికి,

నమస్తే. నా పేరు సునీత. చిన్నప్పట్నుంచీ మీ అభిమానిని. మీ నటన, మీ ఫైట్స్, మీ డ్యాన్స్ అన్నీ యిష్టం నాకు. అన్నిటినీ మించి మీలోని మానవత్వం, మంచితనం, సంస్కారం నాకు మరింత యిష్టం. ఆ విషయం నాకెలా తెలుసని అంటారా? మీరు చేసే ప్రజాహిత కార్యక్రమాలు, సాటిమనిషి క్షేమం పట్ల మీ కన్సర్న్, పెద్దలకు మీరిచ్చే గౌరవం, ఎవరినీ నొప్పించని తత్వం మీరు పాల్గొన్న వివిధ టీవీ కార్యక్రమాల్లో గమనించాను. ముఖ్యంగా మీ భార్యకు మీరిచ్చే గౌరవం నాకెంతో నచ్చింది. ఎక్కడికెళ్ళినా ఆవిడను తీసుకెళ్ళడం, మీ సభల్లో ఆవిడకు సముచిత స్థానం ఇవ్వడం, ఆవిడ మీకిస్తున్న ప్రోత్సాహం గురించి ప్రస్తావించడం... యివన్నీ నటనలా నాకు అనిపించలేదు. ఓ మంచి వ్యక్తి తనవారిపట్ల నిర్వర్తించే బాధ్యతలా, వారి అభిమానం పట్ల ఓ మంచి స్పందనలా నాకు అనిపించేది.

అందరు ఆడపిల్లల్లా నేనూ ఎన్నో కలలుగన్నాను. బాగా చదువుకోవాలని. మంచి ఉద్యోగం చెయ్యాలని, మీలాంటి సహృదయులైన వ్యక్తిని భర్తగా పొందాలని, అందమైన పిల్లలకు జన్మనివ్వాలని, 'వారిని ఉత్తమపౌరులుగా తీర్చిదిద్దాలని ఎన్నో కలలుకన్నాను. నా కలల్లో మొదటికల నెరవేరింది. బీఎస్సీ మైక్రోబయాలజీ మంచి మార్కులతో పాసై యూనివర్సిటీ గోల్డ్ మెడల్ పొందాను.

అమ్మానాన్నలకు 'లేట్ యిష్యూ'ని కావడంతో నా చదువు పూర్తయ్యేసరికి వాళ్ళు యీ లోకం నుంచి తప్పుకున్నారు. ఓ చిరుద్యోగం సంపాదించుకుని వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్లో ఉంటూ 'జీవితం హాయిగా సాగిపోతోంది.' అని భావిస్తున్న సమయంలో నాలో ప్రవేశించింది ఓ జబ్బు. పేరు ఏదైనా నన్ను అప్పటినుండీ మరి రెండు సంవత్సరాలు మాత్రమే యీ ప్రపంచంలో ఉండటానికి అనుమతి యిచ్చిన జబ్బు అది. ప్రైమరీ స్టేజి దాటి సెకండరీ స్టేజి కొచ్చేంతవరకూ తన ఉనికిని తెలియజేయకుండా నాలో దాక్కున్న జబ్బు అది. మొదట భయపడ్డాను. బాధపడ్డాను, గుండె పగిలేలా ఏడ్చాను. తర్వాత మనసు కుదుటపరచుకున్నాను. 'మృత్యువుకు భయపడటం' స్టేజి నుంచి 'మృత్యువును ఆహ్వానించే' స్టేజికొచ్చాను. గత



వారం స్పెషలిస్టులు వచ్చి, నన్ను పరీక్షించి, నేను మరో రెండు వారాల కంటే బ్రతకనని బల్లగుద్ది మరీ చెప్పివెళ్ళారు.

ఈ రోజు మీ పుట్టిన రోజు సందర్భంగా మీరు మా క్యాన్సర్ హాస్పిటల్‌కు వచ్చి మాతో కొంత సమయం గడుపుతారని విన్నాను. గతంలో మీరు ఎయిడ్స్ పేషంట్స్‌ని కలుసుకుని, వారి మనసులోని కోరికల్ని తెలుసుకుని, వాటిలో తీర్చగలిగిన కోర్కెల్ని తీర్చడం నేను టీవీలో చూశాను. వెంటనే నాకో ఆలోచన వచ్చింది.

''ఒక రోజు నా భర్తగా నటించమని మిమ్మల్ని కోరితే?''

అలా అడగడం తప్పో, ఒప్పో, నైతికమో, అనైతికమో తెలియదు నాకు. ఇందుకు మీ శ్రీమతిగారు ఒప్పుకుంటారో లేదో తెలియదు. నా కోరిక తెలియగానే మీకు నా మీద చెప్పలేనంత కోపం రావచ్చు. కానీ అడిగి చూస్తే నష్టం ఏముంది? కోపమొస్తే ఆ క్షణం కోపగించుకుంటారు. లేకుంటే అరుస్తారు. అంతేగా. ఆ విషయాన్ని మనసులో పెట్టుకుని బాధపడే తీరిక మీకు ఉండదు కదా. మీరు ఒప్పుకుంటే ఓ మంచి వ్యక్తికి ఓ రోజైనా భార్యగా ఉన్నానన్న తృప్తితో యీ దీపాన్ని ఆర్పేయవచ్చు. గతంలో ఉరితీసే ముందు ఆ ఖైదీ చివరి కోరికను ప్రభుత్వం తీర్చేదని విన్నాను. దేవుడి బిగించే యీ ఉరికి ముందు దేవుడిలాంటి మీ ముందు నా చివరి కోరికను ఉంచుతున్నాను.

నన్ను కోపగించుకుంటారో, అసహ్యించుకుంటారో, నవ్వుకుంటారో, నన్ను నవ్విస్తారో... మీ యిష్టం.

మీ అభిమాని

– సునీత

□□□□□

హాస్పిటల్ బయట తోటలో సునీత శవం పడుకోబెట్టబడి ఉంది. జయంత్ తను తెచ్చిన పూలమాల శవానికి వేసి సునీత ముఖంవైపు చూశాడు. అమాయకంగా నిద్రపోతున్నట్లు ఉంది ఆమె ముఖం. జయంత్ కళ్ళల్లో నీళ్ళు నిండాయి.

శవం మీద కప్పిన పట్టుచీర వైపు చూపిస్తూ ''మీరిచ్చిన చీర'' అంది శైలజ. అవునన్నట్లు తలూపాడు జయంత్. దుఃఖం వల్ల అతను మాట్లాడలేకపోతున్నాడు.

''ఆమె చివరి కోరిక తీర్చి చాలా మంచి పని చేశారు జయంత్‌గారూ. మీ మంచితనానికి, మీ భార్య విశాల హృదయానికి నా జోహార్లు'' అన్నాడు హాస్పిటల్ చీఫ్ పీటర్ జయంత్‌తో.

ఇంతలో నర్సు వచ్చి జయంత్ ముందు నిలబడి ''నేను జయా... నర్స్‌ని.. సునీత ఉత్తరాన్ని మీకందించింది నేనే'' అంది.

జయంత్ గుర్తుందన్నట్టు తలూపాడు.

''క్యాసెట్ మీకిమ్మంది సునీత. ఇందులో తన వాయిస్ రికార్డ్ చేసింది.'' అంది కళ్ళ నీళ్ళతో.

జయంత్ క్యాసెట్ అందుకుని జేబులో పెట్టుకున్నాడు.

□□□□□

ఇంటికి రాగానే క్యాసెట్‌ను టేప్ రికార్డర్‌లో పెట్టి ఆన్ చేశాడు జయంత్. శైలజతో పాటు సోఫాలో కూర్చుని వినసాగాడు.

జయంత్‌గారూ... ఆదివారం తప్పకుండా వస్తానన్నారు. మీరు మాట తప్పరని ఆ భగవంతుడికి కూడా తెలుసులాగుంది. అందుకే నా నిర్జీవ శరీరాన్ని చూడటానికి మీరు తప్పక వస్తారు కాబట్టి యీ ఆదివారమే ఆయన నన్ను తీసుకెళుతున్నాడు... అమ్మా...

మీరిచ్చిన పట్టుచీర నాకెంత నచ్చిందో తెలుసా? వెన్నెల అంటే నాకెంత యిష్టమో, చందమామ, మల్లెపూలు ఎంత యిష్టమో, ప్రాతఃకాలం, వేసవిలో తొలకరి ఝల్లులు, చలికాలంలో భోగిమంటలు యివన్నీ నాకెంత యిష్టమో మీరిచ్చిన పట్టుచీర నాకంత యిష్టం. ఆ చీర కట్టుకోవాలని నాలుగు రోజుల నుంచీ ప్రయత్నిస్తున్నాను. శక్తి చాలడం లేదు. ఎవరినైనా సహాయం అడుగుదామంటే నవ్వుతారేమోనని భయం. ఇంతలో యీ నొప్పి... అమ్మా...

నేను పోయాక యీ చీర నా శరీరంపై ఉండాలని జయ నర్సుకు చెప్పాను. ఆ చీరలో నేనెంత అందంగా ఉంటానో మీరే చూద్దురు గానీ. అందం అంటే గుర్తొచ్చింది. అందంగా కనిపించే మనుషుల్లో ఎన్ని వికృతమైన ఆలోచనలుంటాయో యీ జబ్బు వచ్చాకే నాకు తెలిసింది. నాకు క్యాన్సర్ అని కన్‌ఫర్మ్ చేసిన డాక్టరు రెండు రోజుల తర్వాత ఫోన్ చేశాడు. రిపోర్టులు తారుమారయ్యాయని. నాకు క్యాన్సర్ లేదని చెప్పడానికి ఫోన్ చేశాడని ఆశపడ్డాను. జబ్బు గురించి భయపడనవసరం లేదని, తన తెలివితేటలన్నీ ఉపయోగించి నన్ను మరో పదేళ్ళు బ్రతికిస్తానని, ఆ లోపల నా అందం వ్యర్థం కాకుండా తనతో సుఖించమని చెప్పాడు. మా హాస్టల్ కేర్ టేకర్ భర్త నన్ను కౌగిలించుకుని ఏడ్చిన పద్ధతి తలుచుకుంటే ఒళ్ళంతా కంపరం పుడుతుంది. మా బాసు, మా కొలీగ్స్ ఒక్కరేమిటి నాకు పరిచయమున్న చాలా మంది మగవాళ్ళు' అయ్యో యింత అందం వ్యర్థం అయిపోతున్నదే' అని బాధపడ్డారు తప్ప 'అయ్యో చనిపోతున్నావా' అని కాస్త కూడా జాలిపడలేదు. వీలైతే ఆ అందాన్ని అనుభవిద్దామని ప్రయత్నం చేశారు.

కానీ మీరు మాత్రం మనిషిలా ప్రవర్తించారు. నా కోసం మీ విలువైన సమయాన్ని కేటాయించారు. సెలవుదినం భార్యాభర్తలు ఎంత ఆనందంగా గడుపుతారో చక్కగా స్క్రీన్ ప్లే తయారు చేసి దాన్ని ఇంప్లిమెంట్ చేశారు. మీరు ఏ పని చేసినా చిత్తశుద్ధితో చేస్తారని ఋజువు చేసుకున్నారు. మీ మనసు చాలా సున్నితం.. కాదు సునీతం. మంచు పల్లకి సినిమా తలచుకుని కళ్ళు నీళ్ళు పెట్టుకున్నారు. 'నాకొక పూమాల తేవాలి నీవు..' తెచ్చారా... అమ్మా... నొప్పి..

ఆ రోజు మీరు ఇంటి నుంచి బయలుదేరుతున్నప్పుడు ఓ ఆత్మీయుడు దూరమవుతున్న ఫీలింగ్ కలిగి ఆ దుఃఖంలో మిమ్మల్ని కౌగిలించుకుని ఏడ్చాను. మీరు నన్ను వీపు తట్టి ఓదారుస్తూ నా శరీరం మీకు తగలకుండా జాగ్రత్త తీసుకోవడం గమనించాను. మీ సంస్కారం నన్ను ముగ్ధురాల్ని చేసింది.

గత ఆదివారం మిమ్మల్ని నిశితంగా పరిశీలించాక ఆంగ్లంలో నేను చదివిన ఓ కొటేషన్ గుర్తొచ్చింది.

'ఇట్ ఈజ్ నైస్ టు బీ ఇంపార్టెంట్ – బట్ ఇటీజ్ ఇంపార్టెంట్ టు బీ నైస్. యు ఆర్ వెరీ నైస్'.

జై... మీ మంచితనానికి... జై...

✤

